## క్లుప్తంగా

### సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ పాండురంగన్న

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ గ్రామ పంచాయతీ నిధుల చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను చురుగ్గా సాగుతున్నాయి. చక్రం బావి నుంచి బాకర్‌సాబ్ ఇంటి వరకు రూ.4 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆదివారం సర్పంచ్ పాండురంగన్న పరిశీలించారు. తాగునీటి బావికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామన్న ప్రజల విన్నపం మేరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని సర్పంచ్ తెలిపారు.

### దిగువపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని దిగువపాడు గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీపై ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక చింతలపల్లి కమిటీ సభ్యులు ప్రచారం నిర్వహించారు. ప్రబోధానందయోగీశ్వరులు రచించిన గ్రంథం ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సభ్యులు పుల్లారెడ్డి, కుమారచారి, నాగ మద్దిలేటి, సంజీవ, గిరిబాబు, రాజెమ్మ తదితరులు పాల్గొన్నారు

### రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి



యువకులతో సమావేశమైన గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): రజక కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి యువతకు ఉపాధి కల్పించాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం చాకలి ఐలమ్మ కార్యాలయంలో ఆయన రజక యువతతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఉన్న దోబీ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్పొరేషన్ ద్వారా చిన్న, చిన్న వ్యాపారాలు చేసుకునే వారికి నిధులు కేటాయించాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పాల్గొన్నారు.

### దుష్ప్రచారం మానుకోవాలి

కర్నూలు(సెంట్రల్): సర్వమత, సామరస్యం, సమత భావన, ప్రేమ, సేవ భావాలతో మానవులను ఐకమత్యం చేసేందుకు అవతారం ఎత్తిన శ్రీషిర్డీ సాయిబాబాపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలన ఏపీ శ్రీషిర్డీ సాయి ధర్మ పరిరక్షణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీనివాస్, జి.హరిహరరావు హితవు పలికారు. కొందరు సమాజంలో చీలికలు తెచ్చేందుకు కావాలనే సాయిబాబాపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం శంకరమఠంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఇటీవల సాయిబాబాపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సాయిబాబా తన మహిమలు, సంఘ సంస్కరణ ద్వారా ప్రజల గుండెల్లో దేవుడిగా కొలువు దీరారన్నారు. కాశీలో సాయిబాబా విగ్రహాలను తొలగించడం, గ్రంథాలను మార్పు చేసే ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సాయిబాబాపై అనుచిత వ్యాఖ్యలుచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కోరుతున్నామన్నారు. ఉపాధ్యక్షుడు కర్లపూడి కృష్ణ, మధుసాయి, కోశాధికారి రబీన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ కమిటీలోకి నూతన సభ్యులు



సమావేశమైన బ్రాహ్మణ సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ: నగరంలోని సంకల్‌బాగ్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం నగర అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. బ్రాహ్మణ సంఘం కమిటీలోకి ఐదుగురు ఉపాధ్యక్షులు, ఒక సంయుక్త కార్యదర్శిని తీసుకున్నట్లు తెలిపారు. బ్రాహ్మణులకు ఇంటి స్థలాలు, టిడ్కో ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌కు కొత్త చైర్మన్‌ను ఏర్పాటు చేసి, రూ.270.61 కోట్లు కేటాయించినందుకు హర్షం వ్యక్తం చేశారు.

### వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ హాస్టళ్లకు సమయానికి విధులకు హాజరుకాని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఆదివారం ఎస్ఎఫ్ఐ మహిళా విభాగం కలెక్టరేట్ సమీపంలోని బాలికల హాస్టళ్లను సందర్శించింది. ఆ సమయంలో వార్డెన్లు లేకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఏకోపాధ్యాయులే దిక్కు !

- ఐదు తరగతులకు ఒకే టీచర్
- సతమతమవుతున్న ఉపాధ్యాయులు
- కుంటుపడుతున్న బోధన
- పట్టించుకోని కూటమి సర్కార్
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



ఎర్రదొడ్డి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్లడంతో ఐదు తరగతుల విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

కోడుమూరు రూరల్ : కూటమి సర్కార్ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధ్యాయుల కొరత మూలంగా విద్యార్థులకు బోధన కుంటుపడుతుంది. కొన్ని పాఠశాలల్లో ఇద్దరు ఉపాధ్యాయులుండగా కొన్నిచోట్ల ఒక్కరే విధులు నిర్వస్తున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ చాలా వరకు ఒక టీచరే విద్యార్థులకు పాఠాలు చెబుతున్న పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల ఆదేశాల అమలు, మధ్యాహ్న భోజనం నిర్వహణ తీరు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. ఈ స్కూళ్లకు సంబంధించి ఓ ఉపాధ్యాయుడు సెలవుపై వెళ్తే అన్ని తరగతులను ఒకే ఉపాధ్యాయుడు చూసుకోవాల్సిన పరిస్థితి. దీంతోపాటు మధ్యాహ్న భోజన తీరునూ పర్యవేక్షించాలి. ఇక చిన్నారులకు పాఠాలు చెబుతారనే ప్రశ్న ఎదురవుతుంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కోడుమూరు నియోజకవర్గ పరిధిలో ఏడు పాఠశాలలకు ఏకోపాధ్యాయులే దిక్కు. ఆయా గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయుల కొరతను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం చేకూరలేదు. ఉపాధ్యాయుల కొరత మూలంగా విద్యార్థుల సంఖ్య సైతం తగ్గిపోతుందంటున్నారు ఆయా గ్రామాల పెద్దలు.

**90 మంది విద్యార్థులు– ఇద్దరు ఉపాధ్యాయులు**

కోడుమూరు మండలంలోని ఎర్రదొడ్డి ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వరకు తరగతులు ఉన్నాయి. 90 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా ఇద్దరు పదోన్నతిపై ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. దీంతో ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతుల విద్యార్థులకు కొన్ని నెలలపాటు విద్యను బోధించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు డిప్యుటేషన్‌పై ఓ ఉపాధ్యాయుడిని ఇక్కడికి బదిలీ చేశారు. ఐదు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు పాఠాలు చెప్పలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఉపాధ్యాయులు సెలువులు తీసుకునేందుకు నానా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఓ ఉపాధ్యాయుడు ఏదైనా పనిమీద సెలవు పెడితే ఆ రోజు ఒక్క టీచరే ఐదు తరగతులకు విద్యను బోధించాల్సి వస్తోంది. ఇద్దరికీ ఒకేరోజు అవసరం పడితే ఏంటీని విషయాన్నే పక్కనపెట్టారు ఇద్దరు ఉపాధ్యాయులు. ఈ పరిస్థితి ఎర్రదొడ్డి ప్రాథమిక పాఠశాల ఒక్కటిదే కాదు. కోడుమూరు నియోజకవర్గంలో ఏడు పాఠశాలల పరిస్థితి ఇది.

**వైఎస్సార్‌సీపీ హయంలో ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట వేశారు. రూ. కోట్లు వెచ్చించి పాఠశాలల రూపురేఖలను మార్చారు. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా మౌలిక వసతులు కల్పించిన విషయం తెలిసిందే. అమ్మ ఒడి, జగనన్న విద్యా, విద్యా వసతి దీవెన తదితర పథకాలు అమలు చేస్తూ పేదల విద్యాభివృద్ధికి పాటుపడింది గత ప్రభుత్వం. ఒక వెలుగు వెలిగిన ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి కూటమి ప్రభుత్వం అధికారంలో ప్రభావాన్ని కోల్పోతున్నాయి. ఒక్క ఉపాధ్యాయుడు తమ పిల్లలకు ఏమి చదువు చెబుతాడన్న ఉద్దేశంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో మాన్పించి ప్రైవేట్ స్కూళ్ల చేర్పిస్తున్నారు. దీంతో పేదలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి సాధ్యమైనంత త్వరగా ఆయా పాఠశాలలకు సరిపడే ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ఒకే ఒక్క ఉపాధ్యాయుడి పాఠశాలలు**

➡ కోడుమూరు మండలంలో ఒకే ఉపాధ్యాయుడు విధులు నిర్వర్తించే పాఠశాలలు నాలుగు ఉన్నాయి. లద్దగిరి ఉర్దూ ప్రాథమిక పాఠశాల, గోరంట్ల ప్రాథమిక మెయిన్ పాఠశాల, ఎర్రదొడ్డి ప్రాథమిక పాఠశాల, రామాపురం ప్రాథమిక పాఠశాలల్లో ఒకే ఒక ఉపాధ్యాయుడు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.

➡ సి.బెళగల్ మండలంలో రెండు స్కూళ్లలో ఇదే పరిస్థితి. వై.కొట్టాల ప్రాథమిక పాఠశాల, గుండ్రేవుల ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 1నుంచి 5వతరగతులకు ఒకే టీచర్ విద్యను బోధిస్తున్నారు. విద్యాబోధన కుంటుపడుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

**ఇబ్బందులు పడుతున్నాం**

బోధనలో ఇబ్బందులు పడుతున్నాం. మా పాఠశాలల్లో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండగా ఇద్దరు ఉపాధ్యాయులు పదోన్నతిపై వెళ్లారు. నేను ఒక్కడినే మిగిలాను. ఉన్నతాధికారులు ఓ ఉపాధ్యాయుడిని డెప్యుటేషన్‌పై మా పాఠశాలకు పంపారు. ఐదు తరగతుల విద్యార్థులకు ఇద్దరమే విద్యను బోధించాలంటే చాలా కష్టంగా ఉంటోంది. పిల్లలందరి హాజరు, మధ్యాహ్న భోజనం తదితర వివరాలను తీసుకునేలోపే సమయం అవుతోంది. ఏమి చేయాలో పాలుపోవడం లేదు. –నవీన్‌కుమార్, హెచ్ఎం, ఎర్రదొడ్డి ప్రాథమిక పాఠశాల

**ఉపాధ్యాయులను నియమించాలని కోరినా స్పందన లేదు**



ఎర్రదొడ్డి ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులున్న సమయంలో విద్య చక్కగా ఉండేది. ఇద్దరు పదోన్నతిపై వెళ్లగా ఉన్నతాధికారులు ఒక్కరిని మాత్రమే ఇక్కడికి డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఐదు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు సక్రంగా పాఠాలు చెప్పలేకపోతున్నారు. దీంతో విద్యా ప్రమాణాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇకనైనా విద్యాశాఖాధికారులు స్పందించి మా పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించాలి. – మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్, ఎర్రదొడ్డి

➡ కర్నూలు మండలంలోని రేమట ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ప్రయోజనం శూన్యం. ఒక ఉపాధ్యాయుడు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో ఏకోపాధ్యాయుడు దిక్కుగా మారింది. ఒకే టీచర్ పాఠాలను బోధిస్తున్నారు.

### నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

సి.బెళగల్: మండల కేంద్రం సి. బెళగల్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలకు సంబంధించి వినతులు అందజేసి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి గైర్హాజరయ్యే అధికారులపై ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పిస్తామని హెచ్చరించారు.

### తైక్వాండో శిక్షణ శిబిరం ప్రారంభం

కర్నూలు (టౌన్): విద్యార్థి దశలో తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ క్రీడలు అవసరమని న్యాయవాది శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం కొండారెడ్డి బురుజు సమీపంలోని కేఎంసీ పార్కులో ఉచిత తైక్వాండో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన ఆయన క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మరక్షణ కోసం బాలికలు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించాలన్నారు. ఒలింపిక్ క్రీడగా గుర్తింపు ఉన్న తైక్వాండో క్రీడలో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం తైక్వాండోలో ఉచిత శిక్షణ అందిస్తున్నామన్నారు. చిన్నారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

### ఉషూ పోటీలు...

కర్నూలు (టౌన్): నగరంలోని కిడ్స్ వరల్డ్ కమ్యూనిటీ హాలులో ఆదివారం 7వ జిల్లా స్థాయి ఉషూ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టీ.శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో అండర్–12, అండర్–15, అండర్–18 విభాగాల్లో బాల బాలికలకు ఉషూ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల తనిఖీపై గ్రామ సభలు



సి.బెళగల్ గ్రామసభలో నివేదికలు వివరిస్తున్న డీఆర్‌పీ విల్సన్

సి.బెళగల్: మండలంలోని సి.బెళగల్, మారందొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాలలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై నిర్వహించిన తనిఖీ లపై శుక్రవారం డీఆర్‌పీలు ఆయా గ్రామాలలో సభలను నిర్వహించారు. మండల కేంద్రం సి.బెళగలో గ్రామ సచివాలయం– 2లో డీఆర్పీ విల్సన్ ఏర్పా టు చేసిన గ్రామసభలో సర్పంచ్ పాండురంగన్న పాల్గొన్నారు. 94 పనులపై నిర్వహించిన తనిఖీ నివేదికలను డీఆర్‌పీ గ్రామస్తులకు చదివి వినిపించారు. అదేవిధంగా మారందొడ్డిలో 38, బురాన్‌దొడ్డిలో 71 చేపట్టిన పనులపై గ్రామ సభలు నిర్వహించిన డీఆర్పీలు నాగరాజు, చెన్నా కృష్ణయ్య నివేదికలను వివరించారు. కొన్ని పనుల కొలతలలో తేడా లు, మస్టర్ల సమస్యలను గుర్తించినట్లు మూడు గ్రామాల డీఆర్పీలు తెలిపారు. గ్రామ సభలలో పంచాయతీ కార్యదర్శులు లక్ష్మినాథ్, వెంకటేశ్వరుల, రఫీ, టీఏలు, ఎఫ్ఏలు, కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్ !



గాలిమిషన్ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్




నేలకు అడుగు ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పాణ్యం: మండల కేంద్రం పాణ్యంలోని డొంగు వద్ద ఓ ట్రాన్స్‌ఫార్మర్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. పక్కనే గాలిమిషన్ కూడా ఉంది. రోజువారీ కార్యకలాపాలు ట్రాన్స్‌ఫార్మర్‌కు కేవలం రెండు అడుగు దూరంలో జరుగుతుంటాయి. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె నేలకు సమాంతరంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దిమ్మె రోడ్డుకు దగ్గరా ఉండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా క్షణాల్లో ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. అధికారులు వీటిని తక్షణమే మార్పు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ దారిలో నిత్యం దుకాణాల వద్దకు టీ, టిఫన్ తీసుకునేందుకు ప్రజలు వస్తుంటారు. అధికారులు స్పందించి ట్రాన్స్‌పార్మర్‌ను మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

### చికెన్ వ్యర్థాలను మున్సిపల్ వాహనాల వారికి ఇవ్వాలి

కర్నూలు (టౌన్): నగర పరిధిలోని చికెన్, మాంసం దుకాణాదారులు వ్యర్థాలను నగరపాలక వాహనాల వారికి అప్పగించాలని ప్రజారోగ్య అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి ఆదివారం ఒక ప్రకటన ద్వారా సూచించారు. మాంసం వ్యర్థాల నిర్వహణ కోసం టెండర్ వేసేంతవరకు తప్పనిసరిగా మున్సిపల్ వాహనాల వారికి అందించాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రైవేటు వ్యక్తులకు ఇస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హెచ్చరికలు బేఖాతరు చేస్తే షాపు ట్రేడ్ లైసెన్సు రద్దు చేయడంతో పాటు సీజ్ చేస్తామని వెల్లడించారు. చికెన్, మాంసం దుకాణ యజమానులు సహకరించాలని కోరారు.

## ఎర్రమల 'కొండలపై' సూరీడు



గడివేముల: చుట్టూ పచ్చటి పొలాలు...పచ్చటి ప్రకృతి అందాలు ప్రకృతి ప్రేమికులను కనువిందు చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో ఎర్రమల కొండలపై సూర్యుడు అస్తమించే సమయంలో ఎరుపెక్కిన సూరీడు కనువిందు చేశాడు. సూర్యుడు అందాలకు ప్రకృతి తోడైంది. వెళ్తున్నా... మళ్లీ ఉదయం వస్తా అంటూ సూర్యాస్తమయ దృశ్యాలు ఆదివారం కనువిందు చేశాయి. ఎర్రసూరీడి అందాలు గడివేముల మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో కనిపించగా సాక్షి కెమెరా బంధించింది.

### 19 మంది మందుబాబులపై కేసు

కర్నూలు (టౌన్): బహిరంగంగా మద్యం సేవిస్తున్న 19 మందిపై పోలీసులు ఆదివారం కేసులు నమోదు చేశారు. స్థానిక నాలుగవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని శరీన్‌నగర్, వక్కెర వాగు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతరం నిఘా పెడతామని చెప్పారు. కర్నూలు నాలుగవ పట్టణ ఎస్ఐ గోపినాథ్, ట్రాఫిక్ ఎస్ఐ హుస్సేన్ పాల్గొన్నారు.

### ప్రజల కోసమే సీపీఐ పోరాటం

కర్నూలు(సెంట్రల్): నిత్యం ప్రజా పోరాటాలు చేస్తున్న సీపీఐకి బాసటగా విరాళాలు ఇవ్వాలని నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి కోరారు. ఆదివారం ఇందిరమ్మ బిల్డింగులు, కాదంబరీ రియల్ ఎస్టేట్, టీవీ 9 కాలనీల్లో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటి విరాళాల సేకరణను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూరు సంవత్సరాలుగా సీపీఐ బడుగు, బలహీన వర్గాల కోసం పనిచేస్తోందన్నారు. ప్రజల నుంచి విరాళాలు సేకరించి ప్రజల కష్టాలను తీర్చేందుకు పోరాటాలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కరీమున్నీసా,మహేష్, సోమన్న అమినాబీ, రాముడు, పద్మ పాల్గొన్నారు.

### ఏఐవైఎఫ్ కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగరంలోని గీతా ముఖర్జీ నగర్ ఏఐవైఎఫ్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రఫీక్, శ్రీకాంత్‌లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, కారుమంచి, నగర కార్యదర్శి బీసన్న, మహిళా సమైక్య నాయకురాలు సోఫియా, ఆశాబేగం పాల్గొన్నారు.

## కంకర పరిచారు... రోడ్డు మరిచారు!



పందిపాడులో కంకర పరిచిన రోడ్ల దృశ్యాలు



- నాలుగు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాలనీల వాసులు
- పట్టించుకోని అధికారులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని పందిపాడు గ్రామం కాలనీ వాసులు ఓ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ఆ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా కాలనీ వాసులకు శాపంగా మారింది. గ్రామానికి సంబంధించి రెండు రోడ్లు వేయాలని కొన్ని నెలల క్రితం కంకర పరిచారు. దీంతో ఆయా వీధులకు చెందిన ప్రజలు రోడ్లు వేస్తున్నారని సంబరపడ్డారు. అయితే కంకర వేసి నాలుగు నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం జరగలేదు. దీంతో రాకపోకలకు వారు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కంకర రాళ్లలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, వృద్ధులు అవస్థలు వర్ణనాతీతం. రాత్రి సమయంలో వాహన చోదకులు అదుపుతప్పి ప్రమాదాలకు గురువుతున్నారు. కంకర రాళ్లలో బైక్‌పై వెళ్లలేక మెయిన్ రోడ్డుపై పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు, కాంట్రాక్టర్ అలసత్వంతోనే రోడ్డు నిర్మాణంలో పనులు జరగడం లేదని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును పూర్తి చేయించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

# అడ్డవాగు.. మృత్యుగడ్డ !

- ప్రమాదాలకు నిలయంగా మారిన తమ్మరాజుపల్లె వంతెన
- 2007లో లారీ ప్రమాదంలో ఏకంగా 12మంది దుర్మరణం
- నేటికీ ప్రమాదాలు కొనసాగుతున్నా పట్టించుకోని అధికారులు



గురువారం అడ్డవాగు బ్రిడ్జి దిమ్మెను ఢీకొనడంతో దెబ్బతిన్న కారు (ఫైల్)



ఈనెల 1న అడ్డువాగు బ్రిడ్జిని ఢీకొనడంతో గాయపడిన వ్యక్తులు (ఫైల్)

పాణ్యం: కర్నూలు–కడప జాతీయహదారి అధికారుల నిర్లక్ష్యం మూలంగా ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పాణ్యం మండల పరిధిలోని తమ్మరాజుపల్లె సమీపాన అడ్డవాగు మృత్యుగడ్డగా మారింది. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించిన ప్రాణాలు పోవాల్సిందే. దశాబ్దాల తరబడి అడ్డవాగు మృత్యుగడ్డగా ప్రజల ప్రాణాలను హరిస్తుంది. నాలుగులైన్ల విస్తరణలో భాగంగా రోడ్డు వెడల్పు చేసినా ప్రమాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. రోడ్డు విస్తరింపజేసిన అధికారులు వంతెనను వెడల్పును విస్మరించారు. దీంతో ప్రయాణికులు ప్రమాదానికి గురువుతూనే ఉన్నారు. కేవలం బ్రిడ్జిని వెడల్పు చేయకపోవడం కారణంగా అడ్డవాగు ప్రమాదాలకు నిలయంగా మారింది. జాతీయ రహదారి భద్రత కమిటీ సభ్యులు పలుమార్లు అడ్డవాగును బ్లాక్ స్పాట్‌గా గుర్తించినప్పటికీ ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఈ వంతెనపై జరిగిన ప్రమాదాలు అన్నిఇన్నీ కావు. 2007 మామిడికాయ లోడ్‌తో వెళ్తున్న లారీపై కూలీలు ప్రయాణిస్తున్నారు. వంతెనపై నుంచి లారీ కిందపడి ఏకంగా 12మంది దుర్మరణం చెందారు. అలాగే ఓ కూల్‌డింక్స్ లారీ వంతెనపై నుంచి పడి ఎనిమిదిమంది చనిపోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. అదేవిధంగా 2010 నుంచి ఇప్పటి వరకు తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా 30మందికి పైగానే తీవ్రంగా గాయపడ్డారు. ఈనెల 1, 2, 4వ తేదీలలోనూ వరుసగా అడ్డవాగు వంతెన వద్ద ప్రమాదాలు జరిగాయి. అయినా హైవే అధికారులు మాత్రం నివారణ చర్యలు చేపట్టడం లేదు.

**కమిటీ సూచనలూ పట్టించుకోని అధికారులు**

జాతీయ రహదారిపై జరిగిగే ప్రమాదాలను నివారించేందుకు జాతీయ భద్రతా కమిటీ పర్యటిస్తుంది. సభ్యులు బ్లాక్ స్పాట్(ఆక్సిడెంట్ జోన్)గా గుర్తించి హైవే అధికారులకు సూచించారు. అయితే వారి సూచనలు పట్టించుకునే నాథుడు కరువయ్యారు. అనేకసార్లు బ్రిడ్జీలను విస్తరించాలని సూచించినప్పటికీ ప్రయోజనం శూన్యంగా మారింది. దీంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వంతెనను వెడల్పు చేయనందునే ప్రమాదాలు జరుగుతున్నాయనే విషయం తెలిసి కూడా అధికారులు పట్టించుకోడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంతెన కేవలం ఒక వాహనం వెళ్లేందుకే వీలుంది. జాతీయ రహదారి కదా అని చాలా వరకు డ్రైవర్లు ఓవర్‌టేక్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన చిన్నపాటి ప్రమాదాల కోకొల్లలు.

**వాహదారులను అప్రమత్తం చేసేలా చర్యలు**

జాతీయ రహదారిపై తమ్మరాజుపల్లె వద్ద ఉన్న అడ్డవాగు ఇరుకున్న ఉండడంతో ప్రమాదాల జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. సుమారు అరకిలోమీటర్ దూరం ఉండగానే ప్రత్యేకంగా బ్లింక్ లైట్లు, బోర్డులు ఏర్పాటు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాలు పాణ్యం సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో అడ్డవాగును క్షేత్ర స్థాయిలో పరిశీలించాం. బ్రిడ్జిపై వెళ్లే వాహనాలను అప్రమత్తం చేసేలా ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేయించాం. ఎన్‌హెచ్ అధికారులకు సమస్యలను తెలియజేశాం. ప్రమాదాల నివారణకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం. – ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి